# పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 25 | విశాఖపట్నం | 26-10- 2025 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 25 | VISAKHAPATNAM | 26-10-2025 SUNDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
9516171797, 9849349934


## లోపలి పేజీల్లో..



5వ పేజీలో

### ప్రైవేట్ బస్సుల వేగానికి కళ్లెమేదీ?

### 2047 నాటికి దేశంలో 350 విమానాశ్రయాలే లక్ష్యమని వెల్లడి

కింజరాపు రామ్మోహన్ నాయుడు



2వ పేజీలో



6వ పేజీలో

### నడుస్తున్నప్పుడు కాళ్లలో నొప్పి?

# 'మొంథా' తుపాను వస్తోంది..
# అప్రమత్తంగా ఉండండి



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై 'మొంథా' తుపాను విరుచుకుపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. యూఏఈ పర్యటన నుంచి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో

## టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు నాయుడు

టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తుపాను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. వాతావరణ శాఖ జారీ చేసిన రెడ్ అలెర్ట్‌ను ప్రస్తావిస్తూ, ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో తుపాను ప్రభావం రాష్ట్రంపై తీవ్రంగా ఉంటుందని సీఎం తెలిపారు. ముఖ్యంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం కాకినాడ సమీపంలో 'మొంథా' తీవ్ర తుపానుగా తీరం దాటుతుందని, ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అంచనా వేస్తున్నట్లు వివరించారు. దీని ప్రభావం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు ఉంటుందని, 80 నుంచి 100 మిల్లీమీటర్ల మేర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుంచే సమగ్ర సన్నాహక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. "ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే ముఖ్యమైనది ఏదీ లేదు. ప్రతి జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి. తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు అవసరమైన వనరులను సమకూర్చుకోవాలి" అని చంద్రబాబు నిర్దేశించారు. తీరప్రాంత ప్రజలకు తుఫాన్ తీవ్రతపై అవగాహన కల్పించి, వారిని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని కలెక్టర్లకే అప్పగించారు. అన్ని ప్రధాన, మధ్య తరహా జలాశయాల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని, నీటి విడుదలను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు స్పష్టం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే (తరువాయి 2వ పేజీలో)

## ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు




దుబాయ్: ప్రవాసాంధ్రుల సంక్షేమం అభివృద్ధి, భద్రతలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఎన్ఆర్టి సొసైటీ ద్వారా ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకాన్ని అందిస్తోంది. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ లో ప్రారంభించారు. ఈ పథకం ద్వారా విదేశాల్లో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు లబ్ధి పొందవచ్చు. ఉద్యోగులు, వలస కార్మికులు మరియు విద్యార్థుల కొరకు ఈ పథకం ప్రవేశపెట్టబడింది. బీమా చేయబడిన వ్యక్తి ప్రమాదం వల్ల మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించబడుతుంది. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు వెళ్లిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ముఖ్యమంత్రివర్యులు ఆకాంక్షిస్తున్నారు. ఈ పథకంలో నమోదు చేసుకోవడానికి https:apnrts.ap.gov.in/insurance వెబ్ సైట్‌ను సందర్శించగలరు.

## కర్నూలు బస్సు ప్రమాదంలో వీడిన మిస్టరీ



2వ పేజీలో

## మొంథా తుఫాను పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ మెంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం జిల్లా, మండల,జోనల్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళా ఖాతంలో అల్పపీడనం (తుఫాన్) కారణంగా రాబోయే 72 గంటలు (3 రోజులు) అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు.ఆస్తి, ప్రాణ, పశు , పంట నష్టం జరగ కుండా అధికార యంత్రాంగం అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, డివిజన్, మండల ,గ్రామ స్థాయి అధికార యంత్రాంగం అంతా పనిచేసే ప్రదేశాల్లోనే (హెడ్ క్వార్టర్స్ లో) ఉండాలని, హెడ్ క్వార్టర్స్ వదలి వెళ్ళ రాదని అన్నారు.ఉద్యోగులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయరాదని తెలిపారు.మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. ఇప్పటికే ఎవరైనా సముద్రంలోకి వెళ్లి ఉంటే ఒడ్డుకు చేరుకోవడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# పట్టణ మంచినీటి ప్రైవేటీకరణ

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో మంచినీరు, మురుగునీటి వ్యవస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్తూ 82, 214 జీవోలను విడుదల చేసింది. వీటిలో కొత్తగా చేపట్టబోతున్న మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, శుద్ధి ప్లాంట్ల నిర్మాణంతో పాటు ఆపరేషన్, నిర్వహణ మొత్తాన్ని పదేళ్ళ పాటు బడా ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయబోతున్నారు. దీనికి కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (చామ్) అనే పేరు తగిలించారు. పైపెచ్చు గత వైసిపి ప్రభుత్వం అమృత్ పథకం కింద నిధులు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించిందని విమర్శిస్తూ, అమృత్ నిధులు కోల్పోకుండా కేంద్రాన్ని ఒప్పించి రాష్ట్రానికి తీసుకోస్తున్నామని కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్తున్నది. కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్-2.0 (అటల్ పునరుద్ధరణ, పట్టణాల రూపాంతరీకరణ మిషన్) పథకంలో రాష్ట్రంలోని మొత్తం 121 నగరాలు, పట్టణాల్లో మంచినీరు, మురుగునీటి సదుపాయాల మెరుగుదలకు రూ.10,251 కోట్ల విలువగల 281 ప్రాజెక్టు పనులను కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (చామ్) పద్ధతిలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చింది. టెండర్ల పక్రియ ప్రారంభించింది. ఈ మొత్తం నిధుల్లో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద వాటాగా రూ. 2470 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.2490 కోట్లు, పట్టణ స్థానిక సంస్థల వాటా రూ. 590 కోట్లుగా తేల్చారు. పట్టణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం కింద కేంద్రం నుండి వచ్చే రూ.590 కోట్లను కూడా ఈ ప్రాజెక్టులకు జమేయాలని నిర్ణయించారు. మొత్తం 281 పనులకు పెట్టుబడి వ్యయంగా రూ.6477 కోట్లుగా నిర్ధారించారు. ఈ చామ్ మోడల్ ద్వారా కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా ప్రజల సొమ్మును ఎలా కాంట్రాక్టర్లకు కట్టబెడుతున్నదో, రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలలోని మౌలిక సదుపాయాలపై బడా ప్రైవేట్ సంస్థలకు గుత్తాధిపత్యం కల్పిస్తున్నదో జీవోలలో పేర్కొన్న అంశాలు చూస్తే సులభంగా అర్థం చేసుకోవచ్చు. మొత్తం ఈ ప్రాజెక్టు పనుల నిర్మాణానికి అయ్యే రూ.6477 కోట్లు పెట్టుబడి వ్యయంలో కాంట్రాక్టర్ 60 శాతం (రూ. 3886 కోట్లు), మిగిలిన 40 శాతం కేంద్ర, రాష్ట్ర, పట్టణ, స్థానిక ప్రభుత్వాలు భరించాలి. కాంట్రాక్టర్లు పెట్టిన పెట్టుబడికి 10.15 శాతం వడ్డీ రేటుతో లెక్కించి అనగా రూ. 2275 కోట్లు వడ్డీతో అసలును కలిపి పదేళ్లలో 40 వాయిదాల్లో ప్రతి మూడు నెలలకొకసారి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం చెల్లిస్తుంది. అలాగే ఈ ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తరువాత పదేళ్ల పాటు కాంట్రాక్టర్లే ఆపరేషన్, నిర్వహణ చేస్తారు. ఈ పదేళ్ల నిర్వహణకుగాను స్థానిక పట్టణ సంస్థలు రూ.2275 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాలి. స్థానిక సంస్థలు ప్రత్యక్షంగా కాంట్రాక్టర్లకు చెల్లించవు. రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలి. వాటిని రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లిస్తుంది. ఈ మొత్తం పనులను, నిధులను సమకూర్చడానికి, కాంట్రాక్టర్లకు ఒప్పంద చెల్లింపుల బాధ్యతను ఏపీ పట్టణ ఫైనాన్స్, మౌలిక సదుపాయాల సంస్థకు అప్పజెప్పారు. ఈ సంస్థ తక్షణం ఈ ప్రాజెక్టు పనుల పెట్టుబడి వ్యయంలో ప్రభుత్వం భరించాల్సిన 40 శాతం వాటాలో రూ.2590 కోట్ల నిధులను బాండ్లు, రుణాలు, స్టాక్ మార్కెట్, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల వంటి వాటి ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిధులను కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించటానికి ముందస్తుగా ఇవ్వనున్నది. ఈ విధానాన్ని అమలు చేయటానికి రాష్ట్రంలోని మొత్తం 123 నగర, పట్టణ స్థానిక సంస్థలను 5 సర్కిళ్ల కింద విడగొట్టారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన చూస్తే అనంతపురం సర్కిల్ పరిధిలో రాయలసీమ జిల్లాలు, నెల్లూరు సర్కిల్ కేంద్రంగా చిత్తూరు నుండి ప్రకాశం వరకు, గుంటూరు, కృష్ణా జిల్లాలు గుంటూరు సర్కిల్‌గా, రాజమండ్రి కేంద్రంగా ఉభయ గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్రలోని పట్టణాలు, నగరాలు అన్ని విశాఖ పట్టణం సర్కిల్‌గా విడగొట్టారు. ఇప్పుడు ఒక్కొక్క సర్కిల్‌ను ఒక్కో కాంట్రాక్టర్ చొప్పున ఐదుగురు బడా కాంట్రాక్టర్ల పరం చేయనున్నారు. ఈ మొత్తం వ్యవహారం మున్సిపల్ కౌన్సిళ్లకు తెలియకుండానే జరిగిపోతున్నది. ఈ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం 123 మున్సిపల్ కౌన్సిళ్లలో చర్చ పెట్టటంగాని, వారి అభిప్రాయాలు తెలుసుకోవటంగాని, తీర్మానాలు తీసుకోవటంగాని జరగలేదు. మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే ఈ విధానాన్ని రూపొందించి ఏకపక్షంగా అమలుకు పూనుకుంది. ఈ చర్య 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీస్తున్నది. పట్టణ స్థానిక సంస్థల హక్కులను పూర్తిగా హరించివేస్తున్నది.

# 2047 నాటికి దేశంలో 350 విమానాశ్రయాలే లక్ష్యమని వెల్లడి

## కింజరాపు రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** "గత పదేళ్లలో దేశంలో ఎన్నో విమానాశ్రయాలను నిర్మించాం. ఈ విషయంలో మేం నిపుణులమయ్యాం. మీరు ఎక్కడైనా భూమి ఇవ్వండి, మేం అక్కడ అత్యాధునిక విమానాశ్రయాన్ని నిర్మిస్తాం" అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. శనివారం నాడు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆధునికీకరించిన టెర్మినల్ 2ను ఆయన ప్రారంభించారు. కాగా, విస్తరణ పనుల కోసం ఏప్రిల్ 2025 నుంచి మూసివేసిన ఈ టెర్మినల్, ఆదివారం తిరిగి కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, భారత విమానయాన రంగంలో రాబోయే రోజుల్లో భారీ విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. 2047 నాటికి దేశంలో విమానాశ్రయాల సంఖ్యను 350కి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 164 విమానాశ్రయాలు పనిచేస్తున్నాయని, రానున్న రెండు దశాబ్దాల్లో మరో 200 ఎయిర్‌పోర్ట్‌లను నిర్మించాలనే లక్ష్యంతో ఉన్నామని మంత్రి వివరించారు. "విమానాశ్రయాలను నిర్మించడం ఇప్పుడు పెద్ద సవాల్ కాదు, భారత్‌కు మరిన్ని విమానాలను తీసుకురావడం ఎలా అనేదే అసలైన సవాల్" అని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ఏవియేషన్ హబ్‌గా మార్చే బృహత్తర ప్రణాళికలో టెర్మినల్ 2 ఆధునికీకరణ ఒక కీలకమైన ముందడుగు అని పేర్కొన్నారు. ఢిల్లీ విమానాశ్రయంపై ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగిన నేపథ్యంలో, దీని సామర్థ్యాన్ని 120 మిలియన్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. టెర్మినల్ 2 విస్తరణతో సుమారు 15 మిలియన్ల సీట్ల సామర్థ్యం పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. దీంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మక '100 మిలియన్ ప్లస్' క్లబ్‌లో చేరింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం ఆరు విమానాశ్రయాలకు మాత్రమే ఈ ఘనత ఉంది. ఎ1-171 విమాన ప్రమాదంపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, దీనిపై 'సమగ్ర దర్యాప్తు' జరుగుతోందని, దానికి కచ్చితమైన కాలపరిమితి చెప్పలేమని అన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ నిబంధనలకు అనుగుణంగా దర్యాప్తు చేస్తోందని వివరించారు. ఇదే సమయంలో, ప్రమాదానికి గురైన విమానం బ్లాక్ బాక్స్‌ను తొలిసారిగా భారత్‌లోనే డీకోడ్ చేశామని, ఇది దేశీయంగా సాధించిన ఒక పెద్ద సాంకేతిక విజయమని ఆయన వెల్లడించారు.

# భారీ వర్షాలు ఈదురుగాలులకు నేలంటిన "వరి"



**తూర్పుగోదావరి జిల్లా, పతాకం న్యూస్:** అల్ప పీడన ద్రోణి ప్రభావంతో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలు ఈదురుగాలులకు మండలంలో వరి కూరగాయ పందిరి పంటలు ఒరిగాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగి మండలంలో సుమారు వరి 8300 ఎకరాలు ఉద్యానవన పంటలు 6500 ఎకరాలు రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పంట ఈనిక దశలో ఉన్నది. ఉసులుమర్రు గ్రామ రైతులు పి.126 విత్తన వరి రకం సాగు చేస్తారు. ప్రస్తుతం 70 ఎకరాల్లో వరి కోతలు పూర్తి చేశారు. కానూరు అగ్రహారం ఉసులుమర్రు పెరవలి కాపవరం ముక్కామల నడుపల్లి ఖండవల్లి తదితర ప్రాంతాల్లో సుమారు 150 ఎకరముల పైన వరి పంట భారీ వర్షాలు ఈదురు గాలులకు నీట మునిగినది. ప్రస్తుతం పంట ఈనిక దశలో ఉండటంతో భారీ వర్షాలకు కంకి పాలు పోసుకోక తాళి గింజ పిట్టపోటు గింజ మచ్చ వచ్చి పంట దిగుబడి తగ్గిపోతుందని రైతుల ఆందోళన చెందుతున్నారు. ముక్కామల ఖండవల్లి కాకరపర్రు అన్నవర్పుడు తదితర ప్రాంతాల్లో కూరగాయ పంటలు వంగ బెండ పొట్ల కాకర పందిరి పంటలు మూడు రోజుల వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాలు నీట మునిగినవి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# ట్రావెల్స్ బస్సులపై 289 కేసులు నమోదు




**అమరావతి, పతాకం న్యూస్:** కర్నూలులో బస్సు ప్రమాదం దృష్ట్యా రవాణాశాఖ ప్రత్యేక డ్రైవ్? చేపట్టింది. రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలతో అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలను ఉల్లంఘించిన ట్రావెల్స్ బస్సులపై 289 కేసులు నమోదు చేశారు. అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 18 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను సైతం సీజ్ చేశారు. అగ్నిమాపక పరికరాలు లేని ప్రైవేటు ట్రావెల్స్‌కు భారీగా జరిమానాలను విధించారు. వీటితో పాటు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రూ.7.08 లక్షల జరిమానాను విధించారు. ఆ క్రమంలో అత్యధికంగా ఏలూరులో 55 కేసులు నమోదు అయ్యాయి. చట్ట విరుద్ధంగా ఉన్న 3 ట్రావెల్స్ బస్సులను సీజ్ చేశారు. జిల్లాల వారీగా తనిఖీల వివరాలు: తూర్పు గోదావరి జిల్లాలో 17 కేసులు నమోదు అయ్యాయి. అదే విధంగా 4 బస్సులను అధికారులు సీజ్ చేశారు. కోనసీమ జిల్లాలో 27 కేసులు నమోదు అయ్యాయి. చిత్తూరు జిల్లాలో 22, కర్నూలు జిల్లాలో 12 కేసులు నమోదయ్యాయి. విశాఖలో 7, నంద్యాలలో మరో 4 కేసులు నమోదు చేశామని ఆర్టీవో అధికారులు తెలియజేశారు. సరైన ధ్రువపత్రాలు లేక 8 బస్సులు ఉన్నాయి. అత్యవసర ద్వారం లేని 13 బస్సులపై కూడా కేసులు నమోదు అయ్యాయి.

# కర్నూలు బస్సు ప్రమాదంలో వీడిన మిస్టరీ



**అమరావతి, పతాకం న్యూస్:** కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం వెనుక ఉన్న మిస్టరీ వీడింది. తొలుత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, బైక్‌ను నేరుగా ఢీకొట్టడం వల్లే మంటలు చెలరేగాయని భావించగా, పోలీసుల దర్యాప్తులో అది తప్పని తేలింది. బైక్‌పై వెనుక కూర్చుని ప్రయాణిస్తూ స్వల్ప గాయాలతో బయటపడిన ఎర్రిస్వామిని పోలీసులు ప్రశ్నించడంతో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. శివశంకర్, అతని స్నేహితుడు ఎర్రిస్వామి ఇద్దరూ బైక్‌పై లక్ష్మీపురం నుంచి రాత్రి 2 గంటలకు బయలుదేరారు. ఎర్రిస్వామిని ఇంటి వద్ద దించేందుకు శివశంకర్ తుగ్గలి బయల్దేరాడు. మార్గమధ్యంలో కియా షోరూం వద్ద ఓ పెట్రోల్ బంకులో ఇంధనం నింపుకున్నారు. రోడ్డుపైకి వచ్చిన కొద్దిసేపటికే వారి బైక్ అదుపుతప్పి స్కిడ్ అయింది. వేగంగా కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలైన ఎర్రిస్వామి, రోడ్డుపై ఎగిరిపడిన తన స్నేహితుడిని, రోడ్డు మధ్యలో ఉన్న బైక్ ను పక్కకి తీయాలని అనుకున్నాడు. శివశంకర్‌ను రోడ్డు పక్కకు లాగేందుకు ఎర్రిస్వామి ప్రయత్నిస్తున్న సమయంలోనే, ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చింది. రోడ్డు మధ్యలో పడి ఉన్న వారి బైక్‌ను చాలాదూరం ఈడ్చుకెళ్లింది. దాంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సు మంటల్లో చిక్కుకోవడం చూసిన ఎర్రిస్వామి భయపడి తన స్వగ్రామం తుగ్గలి వెళ్లిపోయాడు. కాగా, ఈ ఘోర దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు సజీవదహనమైనట్లు రాష్ట్ర హోంమంత్రి అనిత నిన్న ప్రకటించిన విషయం విదితమే. మొదట ఇది రోడ్డు ప్రమాదంగా భావించినా, ఎర్రిస్వామి వాంగ్మూలంతో ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై స్పష్టత వచ్చింది.

# వైద్య విద్యను కాపాడుకుందాం: ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపడుదాం



**అరకులోయ, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని కొనసాగించాలని అరకులోయ వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తిపిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని లోతేరు, గన్నెల పంచాయితీలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని అరకులోయ శాసన సభ్యులు రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా స్వాభి రామ్మూర్తి మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు వైద్య విద్య పట్ల విప్లవం తీసుకువచ్చి రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశ్యంతో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేశారన్నారు. అటువంటి కళాశాలలను కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైవేటు పరం చేయాలని చూడడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. కోటి సంతకాల సేకరణలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి ఉపాధ్యక్షులు పల్టాసింగి విజయ్ కుమార్, సూపర్ ఎంపీపీ జన్ని నరసింహారావు, ఎంపిటిసి సమర్థి శత్రుగుణ, స్వాబి రామచందర్, కోర్రా అర్జున్, నాగేశ్వరరావు, లోతేరు గన్నెల పంచాయతీ సీనియర్ నాయకులు సూపర్ సర్పంచ్ కిల్లో శ్రీరాములు, సూపర్ ఎంపిటిసి కిల్లో నోబో, వార్డు మెంబర్ గుబాయి జగన్నాథం, ఎంపిటిసి ఎం లలిత కుమారి, మండల ప్రధాన కార్యదర్శి సోనియా, పంచాయతీ అధ్యక్షులు మోహన్, కాపు గంటి అర్జున్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 'వైస్సార్సీపీ ప్రజా ఉద్యమం' పోస్టర్ ఆవిష్కరణ



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజవర్గం గంగవరం మండలం గంగవరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు ఈ నెల 28 న అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టనున్న ర్యాలీ కి సంబంధించినవైస్సార్సీపీ "ప్రజా ఉద్యమం" పోస్టర్ " మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ,వైసిపి నేతలతో కలిసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ బిపేద,మధ్య తరగతి విద్యార్థులు,వైద్య విద్య లాంటి ఉన్నత విద్యలు చదవడానికి వీలుగా మాజీ సి.యం. శ్రీ వై.యస్.జగన్ మోహన్ రెడ్డి నూతన కళాశాలల మంజూరుతో,వైద్య విద్యను సామాన్య విద్యార్థికి అందుబాటులోకి తీసుకువచ్చారని,కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రవేటు వ్యక్తుల చేతుల్లో ఉంచేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ ఈ నెల 28 వ తేదీన వై.యస్.ఆర్.సి.పి."ప్రజా ఉద్యమం" కార్యక్రమం చేపడుతున్నామని,దీనికి పార్టీలకతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండల పార్టీ అధ్యక్షులు,యెజ్జు వెంకటేశ్వరరావు, గంగవరం రంపచోడవరం మండలాల ఎంపీపీ లు పల్లాల కృష్ణారెడ్డి బంధం శ్రీదేవి జడ్పిటిసిలు వెంకటలక్ష్మి , వైస్ ఎంపీపీ రామ తులసి, గంగాదేవి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు సిహెచ్ రఘునాథ్, మండలానికి చెందిన సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దువ్వాడ రైల్వే స్టేషన్‌లో వసతులు కల్పించాలి



**గాజువాక, పతాకం న్యూస్:** రైల్వే అధికారులు చేపట్టిన ప్రత్యేక ప్రచారంలో భాగంగా అమృతోత్సవం అమృత్ సంవాద్ 0. 5 కార్యక్రమం దువ్వాడ రైల్వే స్టేషన్ ఒకటవ ప్లాట్ఫామ్ పై ఉన్న ఎగ్జిక్యూటివ్ లాంచ్ లో శనివారం నిర్వహించారు. డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ పర్యావరణ గృహ నిర్వహణ అధికారి నరేంద్ర కుమార్ కురి వాల్తేర్ డివిజన్ నుండి, అదేవిధంగా రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని దువ్వాడ రైల్వే స్టేషన్ లోని ప్లాట్ఫారం ఒకటి, నాలుగు వద్ద తనిఖీలు నిర్వహించారు. అమృత్ సంవాద్ స్టేషన్ అభివృద్ధిలో రాబోయే సౌకర్యాలపై ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు తీసుకోవడం జరిగింది . ఈ సందర్భంగా దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ద్వారా ఆయనకు అందజేసిన సూచనలు,వినతి పత్రం ప్రకారం డస్ట్ బిన్లకు మూతల ఏర్పాటు చేయాలని, రైళ్లల్లో మరియు ఫ్లాట్ ఫామ్ ల వద్ద మరిన్ని వెస్టన్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, ప్లాస్టిక్ బాటిల్ క్రషింగ్ మిషన్లను ఏర్పాటు చేయాలని కోరారు. పొడవైన ఫ్లాట్ ఫామ్ లు, ట్రాక్ ప్రాంతాలు ఎప్రాన్ టాయిలెట్లు,వాషింగ్ సైడ్ వాటర్ స్టాండ్లు, మెట్లు,ఎఫ్ఓబిలు మొదలైవాటిని శుభ్రం చేయడానికి గొట్టం పైపులతో కూడిన హై ప్రెజర్ నాజిల్స్ గల పంపును అందించడం, పెద్ద డస్ట్ బిన్లు,డంపింగు యార్డ్ ను ఏర్పాటు చేయాలన్నారు. రోగులకు అవసరమైన చక్రాల కుర్చీలు, స్ట్రెక్చర్లను అందించడం, సుందరీకరణ పనుల్లో భాగంగా టాయిలెట్లను, పే అండ్ యూస్ టాయిలెట్లను యాంటీ స్కిడ్ టైల్స్ తో ఏర్పాటు చేసి, అందులో వేడినీటి కోసం గీజర్లు,వాల్ మౌంటెడ్ క్లీనింగ్ టిష్యూ పేపర్, షవర్ వాష్ బేసిన్,డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త ప్రధాన స్టేషన్ భవనం ముందు ప్లాట్ఫారం నాలుగు వైపు ఎదురుగా ఉన్న డివైడర్లు వద్ద నీడనిచ్చే మరియు చిన్న పూల మొక్కల కోసం చెట్లను, తోటలను పెంచాలని,ప్లాట్ ఫామ్ ల వద్ద కుండీలలో ఉంచిన ఆక్సిజన్ ప్లాంట్లను అందించడం, వెయిటింగ్ హాళ్ల ముందు పర్యావరణానికి సరిగ్గా నిర్వహించడం, సిబ్బందికి హ్యాండ్ గ్లౌజులు, రెయిన్ కోట్లు, మాస్కులను అందించడం, ప్లాట్ఫాములపై బొగ్గు ఇతర పదార్థాల రవాణా సందర్భంగా గూడ్స్ వ్యాగన్లకు అవసరమైన కవర్లు ఏర్పాటు చేయాలని ఎస్ఎస్సి క్యాబిన్ ఎదురుగా ఉన్న మొక్కలను చెట్లను శుభ్రపరచాలన్నారు.

## మత్స్యకారుల అభిప్రాయాలు మేరకు

# బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేయాలి



**నక్కపల్లి, పతాకం న్యూస్:** మత్స్యకారుల అభిప్రాయం మేరకు బలిటెక్ పార్కులు రద్దు చేయాలని సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం అప్పలరాజు అన్నారు. ఎస్.రాయవరం మండలం, ధర్మవరం అగ్రహారం లో శనివారం రాజయ్య పేట మత్స్యకారుల నాయకులు తో జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ శుక్రవారం రాజయ్య పేట లో అనకాపల్లి జిల్లా కలెక్టర్ గారు అధ్యక్షత జరిగిన సమావేశంలో రాజయ్య పేట మత్స్యకారులు చెప్పిన అంశాలు, వారు ఆవేదనను, వారి కి హెటిరో డ్రగ్స్ కంపెనీ వలన జరిగిన నష్టాన్ని, బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో జరిగే నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయవద్దని మత్స్యకారులు ఆవేదనను ద్రుష్టిలో తీసుకుని వెంటనే రద్దు చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ గాజువాక పెదగంట్యాడ ప్రాంతంలో అదానీ అంబుజా సిమెంట్ సిమెంట్ కంపెనీని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు కాబట్టి మేము కూడా సిమెంట్ కంపెనీకు వ్యతిరేకం అని ప్రకటించారు. అదేవిధంగా రాజయ్య పేట గ్రామంలో మత్స్యకారులు చేస్తున్న పోరాటాన్ని రాష్ట్ర హోం మంత్రి పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి ద్రుష్టి తీసుకుని వెళ్లి బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.మహేష్ బాబు,జీ.సోమేశ్వరరావు, సోమేష్, మాధవరావు, నానాజీ,సత్తియ్య, వెంకటేష్,గురయ్య, కాశీ రావు తదితరులు పాల్గొన్నారు

## గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎమ్మెల్యే మత్స్యలింగం ఉద్యమం



**పెదబయలు, పతాకం న్యూస్:** అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం గిరిజన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మరో అడుగు ముందుకు వేశారు! పెదబయలు మండలంలోని బొండపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన, విద్యార్థుల చదువులో లోపాలను గమనించి ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు: "మన గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించండి, వారి భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది!" నిట్టపుట్టు ఎంపీపీ పాఠశాలలో రేకులు లేని భవనం, సరియైన సదుపాయాల కొరతను చూసి ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, అధికారులకు వెంటనే నూతన రేకులు, భవన నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. స్థానికులతో సమావేశమై, "మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరలో పరిష్కారం చూస్తాం" అని హామీ ఇచ్చారు. మగ్గంవీధి పాఠశాలలోనూ సదుపాయాలను పరిశీలించిన ఆయన, గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం తన నిబద్ధతను మరోసారి నిరూపించారు. "విద్యే మన గిరిజన సోదరుల ఆయుధం. దాన్ని సమర్థవంతంగా అందిద్దాం!" అని పిలుపునిచ్చిన రేగం మత్స్యలింగం, ఈ పర్యటనలో స్థానిక నాయకులు, గ్రామస్థులతో కలిసి పాఠశాలల స్థితిగతులను సమీక్షించారు. గిరిజన విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం ఆయన చేస్తున్న కృషి ఊపందుకుంది!

## శ్రమదానంతో గిరిజనులు కొండ చరియలు తొలగింపు



**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని గత కొద్ది రోజులుగా ఏకధాటిగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని లుంగపర్తి పంచాయతీ పరిధి ఎగువపాడు.పట్టె గ్రామాల సమిపంలో రోడ్డుపై కొండ చరియలు విరిగిపడ్డాయి. సర్పంచ్ సన్యాసి రావు సార్వతో స్థానికులు శనివారం శ్రమాదనంతో మట్టి దిబ్బ. బండారాళ్లు తొలగించారు.ఎగువపాడు. దిగువపట్టే.ఎగువపట్టే.చీడివలస. సుటు ప్రకాల గ్రామ గిరిజనులు .పంచాయతీ. మండల కేంద్రంలో.ఈ రోడ్డు పైనే నిత్యం రాకపోకలు నిర్వహిస్తారు. అయితే రోడ్డుపై కొండ చరియలు విరిగిపడడాంతో బైక్. ఆటో ఆంబులేన్స్ వంటి వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గుర్తించిన స్థానిక గిరిజనులు శ్రమాదనం కింద పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షులు బి చంటిబాబు. వార్డు మెంబర్స్ చిన్నయ్య. గిరిజనులు పాల్గొన్నారు.

# పలువురు సీఐల బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సీపీ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబును ఎయిర్‌పోర్టు ప్రొటోకాల్ అధికారిగా బదిలీ చేసి, ఆయన స్థానంలో పూడి వరప్రసాద్‌ను నియమించారు. సిటీ వీఆర్‌లో ఉన్న ఎస్.రామకృష్ణను ఎయిర్‌పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారిగా నియమించి, అక్కడున్న జి.అర్జున్‌ను సీ పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారిగా పంపారు. సీ పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారిగా ఉన్న వి.శ్రీనివాసరావును సిటీ వీఆర్‌కు అటాచ్ చేశారు. ఎయిర్‌పోర్టు ప్రొటోకాల్ అధికారిగా ఉన్న మలిరెడ్డి నాగేశ్వరరావును సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఎయిర్‌పోర్టు సీఐగా ఉన్న జి.ఉమామహేశ్వరరావును సిటీ వీఆర్‌కు అటాచ్ చేశారు. సీసీఎస్ సీఐగా ఉన్న వి.శంకర్‌నారాయణను ఎయిర్‌పోర్టు లా అండ్ ఆర్డర్ సీఐగా బదిలీ చేశారు. కొత్త బాధ్యతలు వెంటనే చేపట్టాలని కమిషనర్ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

## ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి: స్పీకర్ అయ్యన్న



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం పవిత్రమైన నాగుల చవితి పర్వదినాన్ని నర్సీపట్నంలో కుటుంబ సమేతంగా ఘనంగా జరుపుకున్నారు. సతీమణి చింతకాయల పద్మావతి, తనయుడు కౌన్సిలర్ చింతకాయల రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ నాగుల చవితి శుభాకాంక్షలు తెలిపారు. నాగేంద్ర స్వామి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఐశ్వర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే, నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ప్రతి తెలుగు వ్యక్తి తన వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం సర్వతోముఖ అభివృద్ధి సాధించేందుకు నాగేంద్ర స్వామి కటాక్షం లభించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు గారు ప్రార్థించారు. భక్తి, సాంప్రదాయం, రాష్ట్రాభివృద్ధి పట్ల అంకితభావం కలగలిపిన నాగుల చవితి వేడుకగా నర్సీపట్నం మారింది.

## బొర్రా టోల్ గేట్ పంచాయతీ కు అప్పగించాలని ఆందోళన



**అనంతగిరి, పతాకం న్యూస్:** పంచాయతీ ఆమోదం లేకుండా రెండు సంవత్సరలుగా మండల పరిషత్ ఆధీనంలో కొనసాగిన ప్రముఖ పర్యటక కేంద్రమైన బొర్రా టోల్ గేట్ ను పంచాయతీకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ బాడీ. పేసా కమిటీ సభ్యులు శనివారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు . సందర్భంగా సర్పంచ్ జె. అప్పారావు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి ఒక రూపాయి కూడా చెల్లించకుండా రెండు సంవత్సరాలు తద్వరా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయం ఏమైందని ప్రశ్నించారు. అందుకు పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేపట్టిందాని మండల పరిషత్ తక్షణమే పంచాయతీకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు . ఏడకి వచ్చే ఆదాయాన్ని పంచాయతీకి 60 శాతం మండల పరిషత్ కి 40 శాతం వాట కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేపట్టిందని ఆయన తెలిపారు. మండల పరిషత్ పంచాయతీకి అప్పగించని ఎడల స్వాధీనం చేసుకుని టోల్ గెట్ నడుపుతామని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుబ్బాయి. లక్ష్మి. వార్డు మెంబర్లు ఎస్. సింహాద్రి జె.లక్ష్మి పేసా కమిటీ సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

## కేజీహెచ్‌కు చేరిన

# పది డయాలసిస్ మెషీన్లు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న రోగులకు ఊరట లభించనుంది. కేజీహెచ్‌లోని నెఫ్రాలజీ విభాగానికి ఒకేసారి పది డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ విభాగంలో మొత్తం పది యంత్రాలు ఉండేవి. సాంకేతిక సమస్యలతో ఏడు మెషీన్లు మూలకుచేరాయి. ఈ నేపథ్యంలో డయాలసిస్ సేవలకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దానిపై స్పందించిన కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సమస్య పరిష్కారంపై దృష్టిసారించారు. భారీగా నిధులు అవసరమని ఆస్పత్రి అధికారులు చెప్పడంతో వివిధ కంపెనీల సీఎస్ఆర్ నిధులతో సమకూర్చేందుకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో పరవాడలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) అధికారులను సంప్రతించి, సీఎస్ఆర్ నిధులతో యంత్రాల కొనుగోలుకు ఒప్పించారు. దీంతో సంస్థ కోటి రూపాయలు వెచ్చించి పది డయాలసిస్ మెషీన్లను కొనుగోలు చేసింది. అవి కేజీహెచ్‌కు చేరాయి. మరో మూడు రోజుల్లో నెఫ్రాలజీ విభాగంలో వాటిని ఇన్‌స్టాల్ చేసి రోగుల సేవలకు వినియోగిస్తామని ఆస్పత్రి అధికారులు తెలిపారు. దీంతో డయాలసిస్ రోగులకు ఇబ్బందులు తప్పనున్నాయి. గతంలో నెఫ్రాలజీ విభాగంలో మొత్తం పది మెషీన్లతో ప్రతిరోజూ 20 నుంచి 30 మంది కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేసేవారు. మూడు నెలలుగా ఏడు మెషీన్లు పనిచేయకపోవడంతో కేవలం మూడింటితోనే నెట్టుకొస్తున్నారు. రోగులకు ఇబ్బంది లేకుండా పీపీపీ విధానంలో ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న నెఫ్రోప్లస్ సెంటర్‌లో కొంతమందికి డయాలసిస్ సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ 50 నుంచి 70 మంది రోగులకు నెఫ్రోప్లస్, నెఫ్రాలజీ విభాగంలో డయాలసిస్ చేస్తున్నారు. తాజాగా కొత్త మెషీన్లు అందుబాటులోకి రానుండడంతో రోగుల ఇబ్బందులకు తెరపడుతుందని చెబుతున్నారు. ఇన్‌స్టాలేషన్ పూర్తయిన తరువాత ప్రతిరోజూ నెఫ్రాలజీ విభాగంలోనే 40 నుంచి 50 మంది రోగులకు సేవలందిస్తామంటున్నారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ ప్రత్యేక చొరవతో మెషీన్లు వేగంగా అందుబాటులోకి వచ్చాయని ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ తెలిపారు.

## ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన

# జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గ్రామీణ మండలం చినగదిలిలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా గోదాములను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు. స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## కుల ధృవీకరణ పత్రాలను రద్దు చేసి,బాధ్యులపై చర్యలు తీసుకోండి



**జీకే వీధి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా లో ఎస్టీ వాల్మీకి ఉపజాతి పేరుతో గిరిజనేతరులకు జారీ చేసిన కుల ధృవీకరణ పత్రాలను రద్దు చేసి,బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని భారత్ ఆదివాసీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీ పూజని కోరారు.అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం గొందిపాకల పంచాయితీలో గల గొందిపాకలు,సమగిరి గ్రామాల నుండి చింతపల్లి జ్యోత్స్న ప్రియ,చింతపల్లి రాంబాబు,దుమ్ముల అనిత కుమారి,దుమ్ముల మధుబాబు అనే వారు గిరిజన జాతికి చెందిన వాల్మీకి ఉపజాతి పేరుతో గిరిజన కుల ధృవీకరణ పత్రాలు పొందారు.సదరు చింతపల్లి మండలం,గొందిపాకలు పంచాయతీ పరిధిలోని ఒక్క గ్రామంలో తప్ప మిగత ఏ గ్రామంలో కూడా గిరిజన వాల్మీకి ఉపజాతి లేదు. మరియు చింతపల్లి, దుమ్ముల అనే ఇంటి పేర్లు వాల్మీకి ఉపజాతిలోనే కాకుండా ఇతర ఆదివాసి,గిరిజన ఉపజాతులలో కూడా లేవు.వీరు ఎవరో కూడా ఆ గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రజలకు తెలియదు.ఆఖరికి గొందిపాకల పంచాయతీ విఆర్వోకు కూడా తెలియకుండా కుల ధృవీకరణ పత్రాలు జారీ అయ్యాయని,ఈ విషయాన్ని చింతపల్లి తహశీల్దార్ వారికి 26 ఆగస్టు 2025 న అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం వారు పిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు విచారణ జరపలేదని,ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించి,ఆ కుల ధృవీకరణ పత్రాలను రద్దు చేసి,ఆ కుల ధృవీకరణ పత్రాలు తీసుకున్నవారిపైన,జారీ చేసిన అధికారులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గొందుపాకల పంచాయతీ సర్పంచ్ సాగిన వరలక్ష్మి, చింతపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గెమ్మెల అబ్బాయి నాయుడు,మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రొబ్బ యశ్వంత్,గొందిపాకల గ్రామస్తులు పాల్గొన్నారు.

## మైనార్టీ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో మైనార్టీ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఓఎంసి ఎపి), ఐఇఎస్ సహకారంతో జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు క ప్రకటనలో పేర్కొన్నారు. రెండేళ్ల ఐటిఐ, మూడేళ్ల ఎలక్ట్రీషియన్ ట్రేడ్ విద్యార్హత కలిగి, వయోపరిమితి గరిష్టంగా 30 ఏళ్లలోపు ఉండి, ఎలక్ట్రీషియన్ పనుల్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగాలకు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.2,600 నుంచి 2,700 యూరోలు (భారత కరెన్సీ ప్రకారం రూ.2.60 లక్షల నుంచి రూ.2.70 లక్షలు) పొందొచ్చన్నారు. అదనపు పనికి అదనపు జీతం, ఇతర సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. వసతి, అనువాద, స్థానిక గుర్తింపు ఖర్చులు యజమాని భరిస్తారని వెల్లడించారు. జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అర్హులైన అభ్యర్థులకు జర్మనీ భాషపై పట్టు సాధించేందుకు వీలుగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 12 నుంచి 14 వారాల పాటు శిక్షణ తరగతులను తాత్కాలికంగా రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందుకు అయ్యే ఖర్చును అభ్యర్థులే భరించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు, శిక్షణ కోసం ఫీజు రూ.1.15 లక్షలను మూడు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విమాన, వీసా ఛార్జీలు అభ్యర్థులే స్వయంగా చెల్లించాలన్నారు. ఈ ఉద్యోగాల కోసం వచ్చే నెల 2వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు 9988853335, 8712655686, 8790118349 నెంబర్లకు ఫోన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని వెల్లడించారు.

## వైసీపీ నేతల విమర్శలను తిప్పికొట్టాలి: మంత్రి కొల్లు




**అమరావతి, పతాకం న్యూస్:** ఉమ్మడి కృష్ణ జిల్లా కూటమి నేతల సమావేశం ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికలే అజెండాగా ఈ భేటీ జరిగింది. నియోజకవర్గాల సమస్యలపై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలవాలని నేతలు నిర్ణయించారు. మాజీ మంత్రులు పేర్ని నాని , జోగి రమేష్‌ల విమర్శలను గట్టిగా తిప్పి కొట్టాలని... ఇక నుంచి వైసీపీ నేతల విమర్శలపై ఉమ్మడి జిల్లా నేతలతో సమిష్టిగా ఎదుర్కోవాలని నిర్ణయం తీసుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం ఇప్పటి నుంచి సిద్ధం చేసుకోవాలని కూటమి నేతలు నిర్ణయించారు. సమావేశం అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ప్రభుత్వం గత సంవత్సన్నర కాలంగా చేస్తున్న అభివృద్ధిపై రాబోయే కాలంలో చేసే కార్యక్రమాల గురించి సమావేశమైనట్లు వెల్లడించారు. వైసీపీ గతంలో చేసిన అక్రమాలన్నింటినీ బయటకు తీస్తామన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా అభివృద్ధికి ఏం చేయాలనే అంశంపై చర్చించినట్లు చెప్పారు. జగన్ మోహన్ రెడ్డికి అసలు డేటా సెంటర్ అంటే ఏమిటో తెలియక మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజకీయాల కోసం రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపించారు. జగన్‌కు మద్యం గురించి మాట్లాడే అర్హత లేదని.. పనికి రాని బ్రాండ్‌లు అమ్మిన ఘనత జగన్ దే అంటూ దుయ్యబట్టారు. ఏపీ సురక్ష యాప్‌ను ఇప్పటి వరకు రెండున్నర లక్షల మంది వాడుతున్నారని తెలిపారు. ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి అన్నారు. తిరువూరు ఘటనపై స్పందిస్తూ.. కుటుంబంలో చిన్న చిన్న గొడవలు రావడం సహజమన్నారు. అయినా ఆ విషయాన్ని ముఖ్యమంత్రి చూస్తున్నారని తెలిపారు. ఈరోజు జిల్లా అభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. నిన్న కర్నూలులో జరిగిన బస్సు దుర్ఘటన చాలా దురదృష్టకరమని మంత్రి కొల్లు రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణలో ఫిబ్రవరి 25 నుంచే ఇంటర్ పరీక్షలు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో ఈసారి ఇంటర్ పరీక్షలు ముందే జరగనున్నాయి. గతేడాది కన్నా పది రోజుల ముందే పరీక్షలు ప్రారంభించాలని ఇంటర్ బోర్డు ప్రతిపాదించగా.. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య ఈ రోజు మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఇంటర్ పరీక్షల తేదీలతో పాటు సిలబస్‌లోనూ మార్పులు చేసినట్లు తెలిపారు.ఫస్టియర్ లో ల్యాబ్స్, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉండనున్నాయి. ఇంటర్నల్ పరీక్షలకు 20, ఎక్స్‌టర్నల్ పరీక్షలకు 80 మార్కులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తంగా 9.50 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు ప్రతిఏటా సుమారు 4.20 లక్షలకు పైగా విద్యార్థులు అటెండ్ అవుతుంటారు. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో హాజరయ్యే అవకాశం ఉంది. ఈసారి ప్రాక్టికల్ పరీక్షలను గవర్నమెంట్ కాలేజీలలోనే నిర్వహించేలా బోర్డు ఏర్పాట్లు చేస్తోంది.

# విశాఖలో 88.71% రైస్ స్మార్ట్ కార్డులు పంపిణీ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పౌర సరఫరాల శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ జిల్లాలో 88.71 శాతం మేర జరిగింది. రెండు నెలల నుంచి సచివాలయాలు, రేషన్ డిపోల్లో స్మార్ట్ రైస్ కార్డులు అందుబాటులో ఉంచారు. కార్డుదారులు తమ తమ ప్రాంతాల్లో సచివాలయాలు, రేషన్‌డిపోలకు వెళ్లి కార్డులు తీసుకున్నారు. ఇతర ప్రాంతాలకు వలసవెళ్లినవారు, నగరంలో కొందరు మాత్రం ఇంకా కార్డులు తీసుకోలేదు. జిల్లాలోని 642 రేషన్ డిపోల్లో 5,17,155 మంది కార్డుదారులు ఉన్నారు. ఇప్పటివరకు గ్రామ/వార్డు సచివాలయాల్లో 2,08,322, రేషన్ డిపోల్లో 2,50,437 మంది...మొత్తం 4,58,759 (88.71 శాతం) మంది కార్డులు తీసుకున్నారు. ఇంకా 58,396 మంది తీసుకోవలసి ఉంది. పద్మనాభం మండలంలో 16,569 మందికిగాను 16,125 (97.32 శాతం), పెందుర్తి మండలంలో 10,455 మందికిగాను 9,873 (94.43 శాతం), ఆనందపురం మండలంలో 20,254 మందికి 19,005 (93.83), భీమునిపట్నం మండలంలో 34,521 మందికి 31,250 (90.52 శాతం) మంది కార్డులు తీసుకున్నారు. ఇక నగర పరిధిలో సర్కిల్-1లో 1,54,074కి 1,34,267 (87.14 శాతం), సర్కిల్-2లో 1,50,377కి 129,594 (86.18 శాతం), సర్కిల్-3లో 1,30,905కి 1,18,645 (90.63 శాతం) మందికి పంపిణీ చేశారు. ఈ నెలాఖరు వరకు రేషన్ డిపోల్లో స్మార్ట్ రైస్‌కార్డులు అందుబాటులో ఉంటాయని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి వి.భాస్కర్ తెలిపారు. ఆ తరువాత సహాయ పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో ఉంచుతామని, కార్డుదారులు అక్కడకు వెళ్లి తీసుకోవచ్చునని అన్నారు.

## అత్యున్నత విద్యాబోధనే ప్రభుత్వ లక్ష్యం



**విజయనగరం, పతాకం న్యూస్:** రాష్ట్రంలో విద్యార్థులందరికీ అత్యున్నత విద్యా బోధనను అందించ డమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. వేణుగోపాలపురం ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రూ.745.68 లక్షలతో నిర్మించనున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవన సముదాయానికి ఆయన శంకుస్థాపన చేశారు. దీనిలో అత్యున్నత విద్యాశిక్షణను అందించేందుకు భారీ ఆడిటోరియం, సెమినార్ హాల్, లైబ్రరీ, అదనపు తరగతి గదులు, హాస్టల్ భవనాలను నిర్మించనున్నారు. అదే విధంగా రూ.65.25లక్షలతో నిర్మించిన నాలుగు తరగతి గదుల ను, రూ.61.10లక్షలతో నిర్మించిన ప్రహరీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురువులకు అత్యున్నత శిక్షణ ఇవ్వడానికి, ఆధునిక బోధనా పద్ధతు లను నేర్పించడానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఏడాది కాలంలోనే ఈ భవనాలను పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఏఎంసీ చైర్మన్ కర్రోతు వెంకటనరసింగరావు, టీడీపీ నాయకుడు ఐవీపీ రాజు, డీఈవో యు.మాణిక్యంనా యుడు, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణరావు, పలువురు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు



**కోనసీమ, పతాకం న్యూస్:** మండలంలోని చెముడులంక శ్రీ విజయ దుర్గ చంటి బిడ్డల తల్లి అమ్మవారు, శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్ల ఆలయం వద్ద శ్రీసంతాన నాగమ్మ తల్లి పుట్ట వద్ద నాగుల చవితి సందర్భంగా శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగ దేవత పుట్ట వద్ద తెల్లవారు జామునుంచే భక్తుల సందడి కనిపించింది. పుట్టలో పాలు పోసి చల్లగా కాపాడాలంటూ వేడుకున్నారు. అధిక సంఖ్యలో స్థానికులు విచ్చేసి మొక్కిన మొక్కులు తీర్చుకొని వెళ్లారు. అలాగే ఇక్కడ మొక్కుకుని సంతానం కలిగిన దంపతులతో పాటుగా యువతి, యువకులు అధిక సంఖ్యలో రావడం విశేషం. చిన్నారులను పుట్ట వద్ద కూర్చోబెట్టి బూరెల వసంతం నిర్వహించారు. అనంతరం వారంతా ఆనంద కేరింతలతో బాణాసంచా కాల్చారు. దీంతో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ ఏర్పాట్లు చేశారు.

## రూ.350 కోట్లతో 'రైవాడ' ఆధునికీకరణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** దేవరాపల్లి మండలంలోని రైవాడ జలాశయాన్ని జల వనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.అప్పలనాయుడు సందర్శించారు. కుడి, ఎడమ కాలువల ఇన్‌టెక్ ఛాంబర్‌ల పనితీరును పరిశీలించారు. స్పిల్‌వే వద్దకు వెళ్లి గేట్ల పనితీరు, ఇన్‌ఫ్లో/ అవుట్‌ఫ్లో వివరాలను డీఈఈ జి.సత్యనాయుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రైవాడ అతిథిగృహానికి చేరుకుని మీడియాతో మాట్లాడారు. డ్యామ్ రిహేబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్) ద్వారా రూ.350 కోట్లతో రిజర్వాయర్ విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినట్టు ఆయన చెప్పారు. ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభమవుతుందన్నారు. పంట కాలువల ఆధునికీకరణకు 'జైకా' నిధులు రూ.50 కోట్ల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.జిల్లాలో గ్రోయిన్లకు మరమ్మతులతోపాటు వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు, ఐదు ఎకరాలకుపైబడి విస్తీర్ణం కలిగిన చెరువుల అభివృద్ధి కోసం 'ట్రిపుల్ ఆర్' పథకం ద్వారా రూ.133 కోట్ల వ్యయంతో 88 పనులు చేపట్టడానికి ప్రభుత్వ అనుమతి కోరామన్నారు. జల వనరుల శాఖలో సిబ్బంది కొరత వుందని, సుమారు వంద మంది సిబ్బంది అవసరమని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఆయన వెంట డీఈఈ జి.సత్యనాయుడు, జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు, ఇతర అధికారులు వున్నారు.

## పంప్డ్ స్టోరేజీతో సాగునీటికి ఎసరు..!



**విజయనగరం, పతాకం న్యూస్:** హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం దుగ్గేరు వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేస్తామంటున్న పంప్డ్ స్టోరీ వల్ల సాగునీటి ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఇప్పటికే చివరి ఆయుకట్టుకు సాగునీరు అందడం లేదు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు మరింతగా సాగునీటి ఎద్దడి ఎదురవ్వనుంది. హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం అవసరమైన నీటిని తోటపల్లి, వెంగళరాయసాగర్ ద్వారా పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం దుగ్గేరుకు మళ్లించి, అక్కడ స్టోరేజీ ఏర్పాటు చేసేందుకు ఇటీవల రాష్ట్ర మంత్రి వర్గం తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. 64 వేల ఎకరాల పాత ఆయుకట్టును స్థిరీకరిస్తూనే కుడికాలువ ద్వారా అదనంగా 1,46,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తోటపల్లి ప్రాజెక్టును 20ఏళ్ల క్రితం నిర్మించారు. ఇందులో ఈ ఏడాది 80 వేల ఎకరాలకు మించి సాగునీరు అందలేదు. కుడి ప్రధాన కాలువల మెయింటినెన్స్ గాలికి వదిలేయడం, పిల్లకాలువలు పూర్తిచేయకపోవడం ఇందుకు కారణం. మరోవైపు వెంగళరాయసాగర్ నీరు చివరి ఆయుకట్టు వరకు వెళ్లడం లేదు. దీంతో, ఇప్పటికే దశాబ్ధాలు తరబడి సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆటంకాలను అధిగమించి, లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించాల్సిన ప్రభుత్వం జల విద్యుత్ కోసం ఈ రెండు జలాశయాల నుంచి 24 ఎంజిఎంల నీటిని మళ్లించేందుకు నిర్ణయం చేసింది. 24 ఎంజిఎం అంటే దాదాపు టిఎంసితో సమానం. తోటపల్లి ప్రాజెక్టు నివేదిక ప్రకారం%ొ% ఒకటి టిఎంసి నీరు దాదాపు పదివేల ఎకరాలకు సరిపోతోంది. దీన్నిబట్టి పంప్డ్ స్టోరేజీ కోసం నీటిని మళ్లిస్తే అందుతున్న సాగునీటిలో మరో పదివేల ఎకరాలకు నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలో 40 వేల ఎకరాలు, విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలోని 14 వేల ఎకరాలు, చీపురుపల్లి నియోజకవర్గంలో 25 వేల ఎకరాలు, గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని 15 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. తాజాగా ప్రభుత్వం నిర్ణయం అమల్లోకి వస్తే అటు పార్వతీపురం, ఇటు బబ్బిలి నియోజకవర్గాల్లోనూ సాగునీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంటుంది. 10 వేల ఎకరాల పరిధిలో సుమారు ఐదువేల రైతు కుటుంబాలు, మరో ఐదువేల వ్యవసాయ కార్మిక కుంటుంబాలపైన ప్రభావం పడనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును సిపిఎం వ్యతిరేకిస్తోంది. రైతుల నుంచి ఆందోళన వ్యక్తమౌతోంది.

## ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఉపయోగించాలి



**రామచంద్రాపురం, పతాకం న్యూస్:** మద్యం షాపుల్లో మద్యాన్ని కొనుగోలుచేసే వారు ఎక్సైజ్ సురక్ష యాప్‌ను వినియోగించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురంలో బస్టాండ్ సమీపంలోని ఆర్ఆర్ మద్యం షాప్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక మద్యం విధానాన్ని తీసుకువచ్చి, నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టేందుకు, నాణ్యతను తెలుసు కునేందుకు ప్రభుత్వం ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్'ను రూపొందించిందని, మద్యాన్ని కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఈ యాప్ ద్వారా స్కాన్ చేసి, తాము కొనుగోలు చేసేది నకిలీ మద్యమా లేక నాణ్యమైనదా అన్న విషయాన్ని తెలుసుకోవచ్చని మంత్రి వివరించారు. ఈ యాప్ వినియోగంపై ప్రతి గ్రామంలోనూ ప్రజలకు విధిగా అవగాహన కల్పించాలని ఆయన పిలుపు నిచ్చారు. గత ప్రభుత్వంలో ఎక్కడా డిజిటల్ చెల్లింపులు చేయకుండా, కేవలం నగదు రూపంలో మాత్రమే అమ్మ కాలు చేసి, ఆ సొమ్మంతా తమ జేబుల్లోకి వేసుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తున్న నాణ్యమైన మద్యం వివరాలన్నీ ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌లో ఉంటాయన్నారు. మద్యం ఎక్కడ తయారైంది, ఎప్పుడు తయారైంది, ఏ కంపెనీకి చెందినది, ఎంత ధర వంటి అన్ని వివరాలు తెలుసుకోవచ్చని ఆయన తెలియజేశారు. ప్రభుత్వం నకిలీ మద్యం తయారీ ఎక్కడా జరగకుండా, అలాంటి మద్యం అమ్మకాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుందని, అందులో భాగంగానే క్యూఆర్ కోడ్‌తో కూడిన యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని, ప్లేస్టోర్‌లో కూడా యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని తెలుసుకోవచ్చునని మంత్రి తెలిపారు. మంత్రి సుభాష్ వెంట ఎక్సైజ్ సిఐ, పి. శ్రీనివాస్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఫోన్లు పేలడంతో పెరిగిన ప్రమాద తీవ్రత



**కర్నూలు, పతాకం న్యూస్:** కర్నూలు శివార్లలోని చిన్నటేకూరు సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో మొత్తం 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. అగ్ని ప్రమాదానికి గురైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు లగేజీ క్యాబిన్‌లో తరలిస్తున్న వందల మొబైల్ ఫోన్లు పేలడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందనిఫోరెన్సిక్ టీమ్ ప్రాథమిక విశ్లేషణ ఇచ్చింది. దీంతో భారీ ప్రాణ నష్టం చోటు చేసుకుందని తెలిపింది. తొలుత బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢకొట్టగానే దాని ఆయిల్ ట్యాంక్ మూత ఊడిపడి అందులోని పెట్రోల్ కారడం మొదలైందని పేర్కొన్నారు. అదే సమయంలో బస్సు కింది భాగంలో ద్విచక్రవాహనం ఇరుక్కుపోవడంతో నిప్పురవ్వలు చెలరేగడం, దానికి పెట్రోల్ తోడవడంతో మంటలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. తొలుత లగేజీ క్యాబిన్‌కు మంటలు అంటుకోగా, అందులోనే 400కు పైగా మొబైల్ ఫోన్లతో కూడిన పార్సిల్ ఉండటంతో అధిక వేడికి ఆ ఫోన్ల బ్యాటరీలు బ్లాస్ట్ అయి బస్సుపై క్యాబిన్ భాగంలోని ప్రయాణికుల కంపార్ట్‌మెంట్‌కు వ్యాపించినట్లుగా తెలుస్తోంది. ఈ పరిణామంతో లగేజీ క్యాబిన్‌పై ఉండే సీట్లలో బెర్తుల్లో ఉన్న వారికి ప్రమాదం నుంచి బయటపడే అవకాశం లేకపోయిందని తెలిపారు.

## ఉపాధి చూపరు.. భృతి ఇవ్వరు..!



**అమరావతి, పతాకం న్యూస్:** తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులను అన్నివిధాలా ఆదుకుంటామని కూటమి ఎన్నికల్లో నమ్మబలికింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటి వరకూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏమాత్రం కల్పించని పరిస్థితి నెలకొంది. ఉద్యోగాలు కల్పించకపోతే నెలకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ సైతం అమలు కాలేదు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు హామీల వర్షం కురిపించింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అప్పటి వరకూ నిరుద్యోగ భృతి అందిస్తామని మేనిఫెస్టోలో సైతం పెట్టింది. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడిన పరిస్థితి లేదు. ఏలూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో 2025 సెప్టెంబర్ నాటికి 45,397 మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో 31,280 మంది పురుషులు ఉండగా, 14,117 మంది మహిళలు ఉన్నారు. ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకోని వారి సంఖ్య వేలల్లోనే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ నిర్వహించిన జాబ్‌మేళాల్లో 930 మంది ప్రయివేటు సంస్థలకు ఎంపికైనట్లు ఉపాధి కార్యాలయ లెక్కలు చెబుతున్నాయి. ఏడాదిన్నర గడిచినా పట్టుమని వెయ్యి మందికి కూడా ఉద్యోగాలు కల్పించని పరిస్థితి ఉంది. జిల్లాలో కొత్తగా వచ్చిన పరిశ్రమలుసైతం పెద్దగా లేకుండాపోయాయి. దీంతో నిరుద్యోగుల పరిస్థితి అయోమయంగా మారింది. ఉద్యోగాలు కల్పించే వరకూ నిరుద్యోగులకు నెలకు రూ.మూడు వేల చొప్పున భృతి అందిస్తామని కూటమి సర్కార్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచింది. ఇప్పటి వరకూ దీనిపై ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాల్లేవు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని నిరుద్యోగుల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం నిరుద్యోగులకు నెలకు రూ.రెండు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. ఐదేళ్లపాటు అమలు చేయకుండా ఎన్నికలకు మూడు నెలల ముందు నిరుద్యోగ భృతి పేరుతో హడావుడి చేసింది. యువతలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో 2019 ఎన్నికల్లో టిడిపి ఘోర పరాజయం పాలైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలకు కేవలం రెండుచోట్ల మాత్రమే గెలిచింది. నరసాపురం, ఏలూరు ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది. నిరుద్యోగ భృతి ఈసారీ సక్రమంగా అమలు చేయపోతే కూటమి సర్కార్ అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెప్పొచ్చు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వం వివిధ రకాల సర్వేలు చేయించింది. అందులో నిరుద్యోగులకు సంబంధించిన సర్వే అత్యంత ముఖ్యమైనదని చెప్పొచ్చు. ఇంటి వద్దనే ఉంటూ వర్క్‌ఫ్రం హోమ్ చేయాలనుకునే వారి డేటాను సచివాలయ ఉద్యోగులు సేకరించారు. వర్క్‌ఫ్రం హోమ్ కోసం ముందుకొచ్చిన నిరుద్యోగుల నుంచి సర్టిఫికెట్లు సైతం తీసుకుని అప్‌లోడ్ చేశారు. ఇప్పటి వరకూ అందుకు సంబంధించిన ఎటువంటి సమాచారమూ అభ్యర్థులకు లేకుండా పోయింది. సచివాలయ ఉద్యోగుల వద్దకు వెళ్తే తమకు ఏమీ తెలియదని, సర్వే చేసి, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయడం వరకు మాత్రమే తమ పని అని చెబుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్ పేరుతో చేసిన సర్వే ఏమైందో ఏఒక్కరూ సమాధానం చెప్పడం లేదు. దీంతో వర్క్‌ఫ్రం హోమ్ కోసం ముందుకొచ్చిన ఎంతోమంది మహిళా నిరుద్యోగులు తీవ్ర నిరాశలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన స్పందన లేకుండాపోయింది. దీంతో నిరుద్యోగ యువతలో ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

## కుప్పంలో గోడ కూలి పారిశుద్ధ్య కార్మికుడు మృతి

**కుప్పం, పతాకం న్యూస్:** కుప్పంలో గోడ కూలి పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందాడు. మున్సిపాలిటీ పరిధిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో 15 మంది మున్సిపల్ కార్మికులు కాలువను శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా గోడ కూలింది. దీంతో కాలువలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులపై గోడ పడడంతో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆటోల ద్వారా కుప్పం ఏరియా ఆసుపత్రిక తరలించారు. గాయపడ్డవారు నెల్లూరు జిల్లాకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు సురేష్, హజరత్ అయ్యా, శివయ్య, వెంకటేశు కాగా, ఆస్పత్రికి తరలిస్తుండగా తీవ్రంగా గాయపడ్డ శివయ్య మృతి చెందాడు. మృతుడు శివయ్య ది నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ.

# ప్రైవేటు బస్సుల వేగానికి కళ్లెమేది?



**అమరావతి, పతాకం న్యూస్:** కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున కావేరి ట్రావెల్స్ ఏసీ స్లీపర్ బస్సు దగ్ధమై 20మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన మరోసారి ప్రయాణికుల భద్రతను చర్చనీయాంశం చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అప్పుడప్పుడూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా ప్రైవేటు బస్సుల వేగానికి రవాణా శాఖ అధికారులు కళ్ళెం వేయలేకపోతున్నారన్న విమర్శలున్నాయి. గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో వెళ్ళడం, బస్సు పూర్తిస్థాయిలో కండిషన్ లేకపోవడం వంటి కారణాలతో తరచూ ప్రమాదాలు జరిగి ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. నామ మాత్రపు తనిఖీలతో, అప్పుడప్పుడూ జరిమానాలతో రవాణా శాఖ అధికారులు సరిపెట్టేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం ఒకట్రెండు రోజులు తనిఖీలతో హడావుడి చేస్తున్నారని వారిపై అపప్రధ వుంది. అదీకాక ఇతర రాష్ట్రాల్లో ట్యాక్సులు తక్కువగా వుండడంతో 80 శాతం ప్రైవేటు బస్సులకు మిజోరాం, నాగాలాండ్, అరుణాచల ప్రదేశ్, డయ్యూ డామన్ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేసి అక్కడే ఇన్సూరెన్సు, ఎఫ్‌సీలు తీసుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మీదుగా వివిధ ప్రాంతాలకు తిరుగుతున్న బస్సులను రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రాంతానికి వెళ్ళి రవాణా శాఖ అధికారులు తనిఖీ చేసి కండిషన్ బాగుందని ధృవీకరించిన తర్వాతనే రోడ్డుపైకి రావాలి. అయితే బస్సులు ఇక్కడ రోడ్లపైన తిరుగుతుండగానే అక్కడ లంచాలిచ్చి ఎఫ్‌సీలు తెచ్చుకుంటున్నారనే విమర్శలు చాలాకాలంగా వున్నాయి. ప్రస్తుతం రోడ్లపైన తిరుగుతున్న బస్సుల్లో ఎన్నింటికి ఎఫ్‌సీ వుంది, ఎన్నింటికి ఇన్సూరెన్సు వుంది, ఎన్నింటికి ఫైర్ డిటెక్షన్ అలారాలున్నాయి అనే విషయం ఇక్కడ రవాణా శాఖ అధికారులకు తెలియడంలేదు.

గత ఏడాది మే 19న బెంగళూరు నుంచి అమలాపురం వెళుతున్న మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సుకు రేణిగుంట వద్ద రెండు టైర్లు పేలి వెనుక భాగం దగ్ధమైంది. ఈ ఘటనలో దాదాపు 10మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఈ ఏడాది జనవరిలో చిత్తూరు నగర శివారు ప్రాంతమైన గంగాసాగరం వద్ద ఓ అర్ధరాత్రి తిరుపతి నుంచి మధురై వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు టిప్పర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా 13 మందికి గాయాలయ్యాయి.

ఈ ఏడాది ఫిబ్రవరి 2న నగరి మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా గుడి సమీపంలో జరిగిన ప్రమాదంలో భారతి బస్సు నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా 10మంది తీవ్రంగా గాయపడ్డారు.

# నూతన ఐటీ రూల్స్‌పై ఆందోళనలు

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రూల్స్‌లో మార్పులు చేసింది. ఇటీవలే కొత్త నిబంధనలను నోటిఫై చేసింది. దీంతో ఇప్పుడు సోషల్ మీడియాలో లేదా ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలోని కంటెంట్‌ను తొలగించాలంటూ ఆదేశాలివ్వడానికి కేవలం ఉన్నతస్థాయి ప్రభుత్వ లేదా పోలీసు అధికారులు మాత్రమే అర్హులు. కొత్త నిబంధనల ప్రకారం.. ప్రభుత్వ అధికారుల్లో జాయింట్ సెక్రెటరీ లేదా అంతకంటే ఉన్నత స్థాయివారు, పోలీసు అధికారుల్లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) లేదా అంతకంటే పై స్థాయి అధికారులు మాత్రమే ఆదేశాలను ఇవ్వగలవారు. ఇప్పటి వరకూ ఇంతకు ముందు కింది స్థాయి అధికారులు కూడా ఈ ఆదేశాలు ఇవ్వగలిగేవారు. దీన్ని కేంద్రం ఇప్పుడు వాటిని మరింత కఠినతరం చేయటం గమనార్హం. కేంద్రం ఈ కొత్త రూల్స్‌ను నోటిఫై చేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్ (ఐటిఆర్)లోని నిబంధన 3(1)(డి) సవరణ అనంతరం ఈ కొత్త రూల్స్ నవంబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ ఆదేశాలు తప్పనిసరిగా రాతపూర్వకంగా ఉండాలి. ఏ చట్టం లేదా నిబంధన ఆధారంగా ఆ కంటెంట్ తొలగించాలి, అది ఏ విధమైన తప్పుడు కంటెంట్ (ఉదాహరణకు : ద్వేషపూరిత వ్యాఖ్యలు, అబద్ధ సమాచారం మొదలైనవి), ఏ యూఆర్ఎల్ లేదా లింక్‌ను తొలగించాలన్న వివరాలు ఆ ఆదేశాల్లో స్పష్టంగా ఉండాలి. ప్రతి నెలా, ఆ ఆదేశాలు ఇచ్చిన శాఖలోని ఒక సెక్రెటరీ స్థాయి అధికారి ఆ ఆదేశాలను సమీక్షించాలి. అయితే ఈ మార్పులు ఒక స్పష్టతను, జవాబుదారీతనాన్ని, సముచితతను తీసుకొస్తాయని ప్రభుత్వం చెప్తున్నది. కేవలం పెద్ద స్థాయి బాధ్యత కలిగిన అధికారులు మాత్రమే ఇలాంటి నిర్ణయాలు (సోషల్ మీడియా కంటెంట్ కట్టడికి సంబంధించి) తీసుకోగలుగుతారని అంటున్నది. డీప్‌ఫేక్ వీడియోలు, ఫేక్‌న్యూస్, ఆన్‌లైన్ మోసాలు వంటి సమస్యలను అరికట్ట డంలో తాజా మార్పులు సహాయపడుతాయని ప్రభుత్వం చెప్తున్నది. ప్రపంచవ్యాప్తంగా డీప్‌ఫేక్ వీడియోలు, ఫొటోలు, ఆడియోలు పెరుగుతున్నాయనీ, వీటిని కట్టడి చేసేందుకే తాజా మార్పులని కేంద్రం చెప్తున్నది. వీటిని ఉపయోగించి ప్రైవసీ ఉల్లంఘన, తప్పుడు రాజకీయ





లేదా వార్తల ప్రచారం, మోసం చేస్తూ జరుగుతోన్న డబ్బు దోపిడీకి అడ్డుకట్ట వేయొచ్చని వాదిస్తున్నది. డిజిటల్ హక్కుల కార్యకర్తలు, న్యాయ నిపుణులు, విమర్శకుల వాదన మాత్రం ఇంకోలా ఉన్నది. ఈ విధానం అస్పష్టంగా ఉన్నదనీ, దుర్వినియోగానికి అవకాశం ఉన్నదని వారు అంటున్నారు. ప్రజలతో, సంబంధిత వర్గాలను సంప్రదించకుండా ఈ సవరణలు చేశారని వారు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాలను సమీక్షించేవారు కూడా అదే శాఖలోని అధికారులు కావడం వలన స్వతంత్ర పర్యవేక్షణ ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన గురించి వార్తలు, వీడియోలను తొలగించడానికి రైల్వే అధికారులు సహయోగ్ పోర్టల్‌ను దుర్వినియోగం చేశారని వారు ఉదహరిస్తున్నారు. ఈ మార్పులు 'సహయోగ్ పోర్టల్'ను మరింత బలపరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సహయోగ్ పోర్టల్ అనేది భారత ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం. దీని ద్వారా ప్రభుత్వ శాఖలు, పోలీస్ శాఖలు లేదా ఇతర అధికార సంస్థలు సోషల్ మీడియా లేదా వెబ్‌సైట్లలోని కంటెంట్‌ను తొలగించాలని ఆదేశాలు పంపగలవు. ఏదైనా శాఖ లేదా అధికారి ఒక పోస్ట్ లేదా వెబ్‌పేజ్ చట్టవిరుద్ధమని భావిస్తే.. వారు సహయోగ్ పోర్టల్ ద్వారా ఆ కంటెంట్ గురించి వివరాలు నమోదు చేస్తారు. ఆ ఆదేశం నేరుగా సోషల్ మీడియా కంపెనీలకు వెళ్తుంది. ఆ కంపెనీలు ఆ కంటెంట్‌ను తొలగించటం, చర్యలు తీసుకోవటం వంటివి చేయాలి. అయితే ఈ సహయోగ్ పోర్టల్‌పై చాలా విమర్శలు ఉన్నాయి. ఇది ప్రభుత్వానికి ఎక్కువ అధికారాన్ని ఇస్తుందనీ, పారదర్శకత లేకుండా కంటెంట్ తొలగించడానికి ఉపయోగపడు తుందనీ, స్వేచ్ఛా భావవ్యక్తీకరణకు ముప్పు తెస్తోందని ఆరోపణలు ఉన్నాయి. ఎక్స్ ఈ పోర్టల్‌పై కర్నాటక హైకోర్టులో కేసు వేసింది. అది తమ స్వేచ్ఛను, పారదర్శకతను ఉల్లంఘిస్తుందని వాదించింది. కానీ హైకోర్టు సదరు పిటిషన్‌ను తిరస్కరించింది. ఇప్పుడు ఎక్స్ కంపెనీ సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నది.

# నడుస్తున్నప్పుడు కాళ్లలో నొప్పి? మీలో 'ఆ సమస్య' ఉండొచ్చంటున్న వైద్యులు!



చాలా మందికి నడుస్తున్నప్పుడు కాళ్లు, పిక్కల్లో ఒక మాదిరి నుంచి తీవ్రమైన నొప్పి. నడక ఆపేస్తే వెంటనే తగ్గిపోతుంది. మళ్లీ నడక మొదలెట్టగానే తిరిగి నొప్పి కలుగుతుంది. కొన్నిసార్లు పాదం వేళ్లు రంగు మారి, నల్లగా అవ్వచ్చు. కాళ్ల వాపూ తలెత్తొచ్చు. పాదాల మీద పుండ్లూ పడుతుంటాయి. మలాములు, క్రీములు ఎన్ని రాసినా ఒక పట్టాన మానవు. నెలలు, ఏళ్ల కొద్దీ వేధిస్తూ వస్తుంటాయి. ఏమైందో తెలియక చాలామంది చిట్కాలను, నాటు వైద్యాలను ఆశ్రయిస్తుంటారు. ఫలితం కనిపించక డాక్టర్లనూ మారుస్తుంటారు. ఇంతకీ ఈ సమస్యలకు కారణమేంటో ఇప్పుడు తెలుసుకుందాం! మన శరీరం సజావుగా పనిచేయటానికి అన్ని అవయవాలకూ రక్తం సరఫరా కావటం చాలా ముఖ్యం. రక్తనాళ వ్యవస్థ సరిగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ఒకవేళ పూడికలతో రక్తనాళాల లోపలి మార్గం కుంచించుకున్నా, పూర్తిగా మూసుకున్నా చిక్కులు తప్పవంటున్నారు నిపుణులు. కాలి రక్తనాళాల్లో ఇలాంటివి తలెత్తితే రకరకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితిని పరిధీయ ధమని వ్యాధి(%ృూాణ%) ఒక కారణమని నిపుణులు అంటున్నారు. ఇందుకు పొగ తాగటం, డయాబెటిస్ దగ్గరి నుంచి పాత పుండ్ల వరకూ రకరకాల అంశాలు దోహదం చేస్తాయని చెబుతున్నారు.

మధుమేహంతో : ఈ సమస్య ఉన్నవారికి నాడులు, రక్తనాళాలు దెబ్బతినే ముప్పు ఎక్కువ. దీంతో పాదాలు తిమ్మిరెక్కినట్టు, సూదుల మీద నడుస్తున్నట్టు అనిపిస్తుంటుందని నిపుణులు చెబుతున్నారు. వీటితో పాటు నడుస్తున్నప్పుడు కాళ్లలో నొప్పిగా ఉంటుందని ధ్యయనం పేర్కొంది. దీంతో రక్త సరఫరా గణనీయంగా తగ్గిపోయిందని భావించాలని సూచిస్తున్నారు. డయాబెటిస్‌తో బాధపడుతున్న వారిలో రక్తనాళాల గోడల్లో నిరంతరం క్యాల్షియం, కొలెస్ట్రాల్ పోగుపడుతూ వస్తుంటుందని పేర్కొంటున్నారు. ఇవి పూడికలుగా ఏర్పడటం వల్ల కాళ్లకు రక్త సరఫరా తగ్గుతుందని వివరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రక్తనాళం పూర్తిగా మూసుకుపోవచ్చని, ఇది తీవ్రమైన నొప్పికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. డయాబెటిస్ మెల్లిటస్ ఉండటం ప్రమాదాన్ని బాగా పెంచుతుందని అధ్యయనం పేర్కొంది.

కాళ్లు ఉబ్బినా సంకేతమే : సిరల ద్వారా చెడు రక్తం గుండెకు చేరుకుంటుంది. అక్కడి నుంచి ఊపిరితిత్తులకు వెళ్లి, ఆక్సిజన్‌ను నింపుకొని తిరిగి గుండెకు చేరుకుంటుంది. ఇది ధమనుల ద్వారా శరీర భాగాలకు సరఫరా అవుతుంది. ఈ ప్రక్రియ శరీరంలో నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఒకవేళ కాలి సిరల్లో అడ్డంకులు ఏర్పడినా, కుంచించుకు పోయినా చెడు రక్తం పైకి చేరటం తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో కాళ్లు ఉబ్బటం మొదలవుతుందని అంటున్నారు. కాళ్లకు రక్త సరఫరా తక్కువగా ఉంటే పాదాలు లేదా వేళ్లపై నయం కాని పుండ్లు ఏర్పడతాయని అధ్యయనం పేర్కొంది.

పొగ తాగేవారిలో, పొగాకు నమిలేవారిలో, మధుమేహం గలవారిలో కొందరు నడుస్తున్నప్పుడు వెన్నులో లేదా తొడలో నొప్పి వస్తుంటుందని చెబుతుంటారు. వీరిలో చాలా మందిలో కడుపు వద్ద బృహద్ధమని మూసుకోవటం లేదా కుంచించు పోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రధాన రక్తనాళం కుంచించుకున్నా, పూర్తిగా మూసుకున్నా వీపు కండరాలకు రక్త సరఫరా తగ్గుతుందని పేర్కొంటున్నారు. ఫలితంగా, నడుం నొప్పి వస్తుందని అంటున్నారు. వీపు కండరాలకు రక్త సరఫరా తగ్గితే పాదాలకూ తగ్గుతుందని తెలియజేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నడుస్తున్నప్పుడు నడుం నొప్పితో పాటు పాదాల్లోనూ నొప్పి పుడుతుందని వివరిస్తున్నారు.

కొంతమందిలో రక్తనాళాల గోడల్లో వాపు తలెత్తొచ్చు. దీంతో లోపలి మార్గం సన్నబడుతుందంటున్నారు నిపుణులు. దీంతో రక్త ప్రసరణ వ్యవస్థ అస్తవ్యస్తమవుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో రక్త ప్రసరణ మెరుగవ్వటానికి సమయానికి తగు చర్యలు తీసుకోకపోతే పాదం వేళ్ల చర్మం రంగు మారుతుందని తెలియజేస్తున్నారు. ఎందుకంటే, రక్త సరఫరా కాకపోవటం వల్ల వేళ్లు కుళ్లిపోతాయని పేర్కొంటున్నారు. ఈ సమస్య ఎక్కువగా మహిళల్లో కనిపిస్తుంటుందని తెలియజేస్తున్నారు.

వ్యాస్కులర్ & కార్డియోథొరాసిడ్ సర్జన్ డా.కె.కె పాండే మాట్లాడుతూ కాలి రక్తనాళాలు సంకోచించినా, పూర్తిగా మూసుకున్నా వెంటనే వ్యాస్కులర్ సర్జన్‌ను సంప్రదించాలి. సమస్య తీవ్రతను బట్టి చికిత్సను నిర్ణయిస్తాం. రక్తాన్ని పలుచగా చేసే మందులు, కొలెస్ట్రాల్‌?ను తగ్గించే మందులు, నొప్పి మందులు మేలు చేస్తాయి. వీటితో ఫలితం రాకపోతే సర్జరీ అవసరం. రక్తనాళంలో కొద్ది భాగంలోనే పూడికలు ఉంటే స్టెంట్ వేస్తాం. దీని ద్వారా పాదాలకు తిరిగి రక్త సరఫరా పుంజుకుంటుంది. ఒకవేళ పూడిక ఎక్కువగా ఉండే బైపాస్ సర్జరీ అవసరం. ఇందులో వేరే చోటు నుంచి రక్తనాళాన్ని తెచ్చి, పూడికకు అటూ, ఇటూ అతికిస్తాం. దీంతో రక్త సరఫరా మెరుగవుతుంది. వయసు, సమస్య తీవ్రత, ఇతర జబ్బులను పరిగణనలోకి తీసుకొని చికిత్సను నిర్ణయిస్తామన్నారు. నడుస్తున్నప్పుడు పిక్కల్లో నొప్పి వస్తోందంటే కాళ్లకు గణనీయంగా రక్త ప్రసరణ తగ్గిందనే అనుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కూర్చున్నప్పుడు లేదా పడుకున్నప్పుడు పాదాలు నొప్పి పుడుతున్నాయంటే సమస్య ప్రమాదకర స్థితికి చేరిందని హెచ్చరిస్తున్నారు. పాదాలకు 90% వరకూ రక్త ప్రసరణ తగ్గిందనే అనుకోవాలని, పరిస్థితి అలాగే కొనసాగితే వేళ్లు, పాదాలకు రక్త సరఫరా నిలిచిపోయి, ఆ భాగాలు కుళ్లిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. దీనికి సరైన చికిత్స తీసుకోకపోతే ఆయా భాగాలను తొలగించాల్సి వస్తుందని వివరిస్తున్నారు.

# ఇలా చేస్తే మొటిమలు

## త్వరగా తగ్గిపోతాయి..





కొంతమందికి టీనేజ్‌లో వచ్చిన మొటిమలు ఏం చేసినా తగ్గవు. వీటిని తగ్గించుకునేందుకు ఏం చేయాలో తెలుసుకోండి. చాలా మందిని వేధించే సమస్యల్లో మొటిమలు కూడా ఉన్నాయి. ఏం చేసినా ఈ సమస్య తగ్గదు. దీనికి చాలా కారణాలు ఉంటాయి. ఎందువల్ల సమస్య వస్తుంది. దీనిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.

అదే విధంగా కొంతమంది పదే పదే చేతులతో ముఖాన్ని తాకుతుంటారు. దీని వల్ల కూడా చేతుల్లోని బ్యాక్టీరియా ముఖంపైకి చేరి మొటిమలు పెరుగుతాయి. అలా కాకుండా ముఖాన్ని తాకకుండా చూడండి. అదేవిధంగా, ఎక్కువగా కెమికల్స్ ఉన్న క్లెన్సర్స్, ఎక్స్‌ఫోలియేటర్స్ వాడడం వల్ల మొటిమలు వస్తాయి. కాబట్టి, మైల్డ్‌గా ఉన్న ప్రోడక్ట్స్‌ని వాడండి. నేచురల్ ప్రోడక్ట్ అయితే మరీ మంచిది.

సరిగ్గా ముఖాన్ని క్లీన్ చేయకపోయినా మొటిమలు పెరుగుతాయి. రోజంతా ఉన్న పొల్యూషన్, స్కిన్‌పై మురికి, నూనె, బ్యాక్టీరియా పేరుకుపోవడం వల్లే సమస్య పెరుగుతుంది. కాబట్టి, ముఖాన్ని చక్కగా క్లీన్ చేయాలి.

మొటిమలు రావడానికి మరో ముఖ్య కారణం ఒత్తిడి. ఒత్తిడి హార్మోన్ల సరిగ్గా లేకపోవడం వల్లే మొటిమలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే ఒత్తిడిని తగ్గించుకోవాలి. ధ్యానం, యోగా వంటివి చేయండి.

కొంతమందికి పాలు, పాల పదార్థాలు తీసుకోవడం వల్ల కూడా మొటిమలు వస్తాయి. అది గమనించి వీటిని మితంగా తీసుకోవాలి.

అదే విధంగా, పడుకునే ముందు మేకప్‌ని క్లీన్ చేయాలి. లేకపోతే మేకప్ ముఖ రంధ్రాల్లోకి వెళ్తుంది. అవి మూసుకుపోయి మొటిమలు వస్తాయి. వీటితో పాటు మేకప్ వేసుకునేవారు ఆ బ్రష్‌లను కనీసం 3 నెలలకోసారైనా మార్చండి. నిద్రలేమి సమస్య కూడా మొటిమలు రావడానికి మరో ముఖ్య కారణం. ఎందుకంటే, నిద్రలేమి కారణంగా ఒత్తిడి పెరిగి మొటిమలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే హాయిగా నిద్రపోండి. దీని వల్ల ఆరోగ్యం బావుంటుంది, అందంగా కూడా మారతారు.

# వీధికెక్కిన వివాదాలు.. కూటమి పార్టీల ఆధిపత్యపోరు



**అమరావతి, పతాకం న్యూస్:** కూటమి పార్టీల మధ్య ఆధిపత్యపోరు ఒక వైపు, స్వంత పార్టీ ప్రజాప్రతినిధుల మధ్యనే పొడచూపుతున్న విభేదాలు మరో వైపు టిడిపి అధిష్టానాన్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయి. ఇవి చాలదన్నట్లు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్, టిడిపి నేత జెసి ప్రభాకర్‌రెడ్డి పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సభలో అనంతపురం జిల్లా అదనపు ఎస్‌పినుద్దేశించి ఎత్తుకున్న తిట్ల పురాణం పోలీస్‌శాఖకు, ప్రభుత్వానికి మధ్య అగాధం సృష్టించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వేర్వేరుగా విదేశీ పర్యటనలలో ఉన్న సమయంలో కూటమిలో, స్వపక్షంలో నెలకొన్న కీచులాటలు రాజకీయగా దుమారం రేపాయి. ఈ పరిణామాలు ప్రతిపక్షాలకు, ప్రధానంగా వైసిపికి అస్త్రాలుగా మారడంతో పరిస్థితులను ఏ విధంగా చక్కదిద్దాలన్నదానిపై టిడిపిలోని కీలక నేతలు తీవ్రంగా మదనపడుతున్నారు. విదేశాల్లో ఉన్న చంద్రబాబు, లోకేష్ అక్కడి నుండే ఈ వ్యవహారాలపై దృష్టి సారించారు.

ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు టిడిపి ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావుకు, స్వంత పార్టీకే చెందిన విజయవాడ ఎంపి కేసినేని చిన్ని మధ్య కొంత కాలంగా నెలకొన్న అంతర్గత విభేదాలు గురువారం ఒక్కసారిగా రచ్చకెక్కి తీవ్రరూపం దాల్చాయి. ఎంఎల్ఎ టిక్కెట్ కోసం చిన్నికి తాను రూ.ఐదు కోట్లు ఇచ్చానంటూ బ్యాంక్ వివరాలతో సహా కొలికపూడి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం సంచలనమైంది. మరిన్ని విషయాలు శుక్రవారం తెలుపుతానని ఆయన పేర్కొన్నారు. దానికి ఎంపి చిన్ని ఘాటుగా జవాబిచ్చారు. తిరువూరులో దొంగే .. 'దొంగ దొంగ' అని అరుస్తున్నారని, వైసిపి కోవర్టుగా మారారని ఆయన ఎంఎల్ఎపై విరుచుకుపడ్డారు. ఎంపి, ఎంఎల్ఎ మధ్య గొడవలను చక్కదిద్దేందుకు టిడిపి అధిష్టానం రంగంలోకి దిగింది. దుబాయ్ లో ఉన్న చంద్రబాబు అక్కడి నుండే ఈ వ్యవహారంపై స్పందించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఇరువురు నేతలను పిలిచి మాట్లాడతానని పల్లా శ్రీనివాస్ అనగా, అవసరం లేదని యుఎఇ నుండి వచ్చిన తరువాత తానే స్వయంగా దృష్టి సారిస్తానని బాబు చెప్పినట్లు సమాచారం. దీంతో శుక్రవారం ఆ ఇరువురు నేతలతో నిర్వహించ తలపెట్టిన సమావేశాన్ని పల్లా శ్రీనివాస్ రద్దు చేశారు. కొలికపూడి వ్యవహారశైలి గతంలో పలుమార్లు వివాదాస్పదమైంది. అప్పట్లో టిడిపి అధిష్టానం పరిస్థితిని చక్కబెట్టే చర్యలు చేపట్టినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డిఎస్‌పి జయసూర్య జూదగృహాలు, ఇత్యాది అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నట్లు తనకు ఫిర్యాదులందాయని, దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ ఆ జిల్లా ఎస్‌పిని, రాష్ట్ర డిజిపిని ఆదేశించారు. దానిపై భీమవరం ప్రాంతానికే చెందిన ఉప సభాపతి, టిడిపి ఎంఎల్ఎ రఘురామ కృష్ణరాజు ప్రెస్ మీట్ పెట్టి మరీ సదరు డిఎస్‌పి మంచి అధికారని, ఆయనకు మంచి ట్రాక్ రికార్డు ఉందని పవన్‌కు కౌంటర్ ఇచ్చినంతపని చేశారు. ఆరోపణలెదుర్కొంటున్న డిఎస్‌పికి డిప్యూటి స్పీకర్ ఎలా మద్దతిస్తారని జనసేన ఆగ్రహంతో ఊగిపోతోంది. రఘురామ ఆ డిఎస్‌పితో అసాంఘిక కార్యక్రమాల నిర్వహణకు పరోక్షంగా మద్దతిస్తున్నారని ఆరోపిస్తోంది. మొదటి నుంచీ జనసేన-టిడిపి మధ్య ఆధిపత్య కీచులాటలు తరచు బయట పడుతునే ఉన్నాయి. పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకర్గంలో టిడిపి మాజీ ఎంఎల్ఎ వర్మకు స్థానిక నాయకత్వానికి పడట్లేదు. ఈ మధ్యనే నాగబాబు ఎంఎల్‌సి అయ్యాక ఒక సభలో చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య ప్రకంపనలు రేపాయి. శాంతి భద్రతలపైనా, హెూం మంత్రి అనితపైనా డిప్యూటి సిఎం హెూదాలో పవన్ చేసిన వ్యాఖ్యలు సైతం టిడిపి, జనసేన కూటమిలో అసంతృప్తులకు కారణమయ్యాయి. ఇప్పుడు భీమవరం డిఎస్‌పి వ్యవహారంతో వ్యవహారం మరింత ముదిరింది.

అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినం సభా వేదికపై టిడిపి నేత జెసి ప్రభాకర్‌రెడ్డి జిల్లా ఎఎస్‌పి రోహిత్ కుమార్‌పై తిట్ల దండకం ఎత్తుకున్నారు. పనికిమాలిన ఆఫీసర్‌వంటూ దుర్భాషలాడారు. దీనిపై పోలీస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించడంతోపాటు జెసిని శిక్షించాలని డిమాండ్ చేసింది. అనంతపురం ఎస్‌పి పి జగదీష్ సైతం జెసి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. జెసి టిడిపి నాయకుడైనందునే పోలీసులు ఆయనపై చర్యలు తీసుకోలేదని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని టార్గెట్ చేసి విమర్శలు సంధిస్తున్నాయి. ఈ పరిమామంతో టిడిపి, కూటమి ప్రభుత్వం ఎటూ పాల్పోకుంది.

## 10కి పైగా రాష్ట్రాల్లో ఎస్ఐఆర్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మొదటి దశలో దేశవ్యాప్తంగా 10కిపైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఎన్నికల అధికారుల రెండు రోజుల సమావేశాలు గురువారం ఇక్కడ ముగిసాయి. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న కేరళ, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌సహా 10కు పైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ నిర్వహించేందుకు సంసిద్ధతపై ఈ సమావేశాల్లో చర్చించారు. త్వరలో కమిషన్ పూర్తిస్థాయిలో చర్చించి, షెడ్యూల్‌ను ప్రకటిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## అదానీ గ్రూప్ కంపెనీల లాభాలకు 33 కోట్ల ఎల్ఐసి నిధులు : జైరాం రమేశ్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) 30 కోట్ల రూపాయల పాలసీదారుల పొదుపు మొత్తాన్ని అదానీ గ్రూప్‌కు ప్రయోజనం చేకూర్చడానికి మోడీ ప్రభుత్వం వాటిని ఓ క్రమపద్ధతిలో దుర్వినియోగం చేశారని శనివారం కాంగ్రెస్ ఆరోపించింది. అదానీగ్రూప్‌లో పెట్టుబడులు పెట్టమని ఆ గ్రూప్ ఎల్ఐసిని ఎందుకు అంత బలవంతం చేసిందో పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ దర్యాప్తు చేయాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే కాంగ్రెస్ ఈ విషయంపై ఆరోపిస్తున్నప్పటికీ ఇంతవరకూ అదానీ గ్రూప్ కానీ.. కేంద్ర ప్రభుత్వంకానీ స్పందించకపోవడం గమనార్హం. దీనిపై శనివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేష్ మోడీ ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శించారు. మోదానీ జాయింట్ వెంచర్.. ఎల్ఐసిని, ఆ సంస్థలోని పాలసీదారుల పొదుపు 30 కోట్లని క్రమపద్ధతిలో ఎలా దుర్వినియోగం చేశారనే కలవరపెట్టే నిజాలను మీడియా బయటపెట్టింది అని జైరాం రమేష్ అన్నారు. మే 2025లో వివిధ అదానీ గ్రూప్ కంపెనీలలో సుమారు 33 వేల కోట్ల ఎల్ఐసి నిధులను పెట్టుబడి పెట్టమని భారత అధికారులు ఎల్ఐసికి ప్రతిపాదించారని, ఈ ప్రయత్నాన్ని అధికారులు మరింత ముందుకు తీసుకెళ్లారనే విషయాలను తాజాగా అంతర్గత పత్రాలు వెల్లడించాయని జైరాం రమేష్ అన్నారు. ఈ వ్యవహారమంతా అదానీ గ్రూప్‌పై విశ్వాసాన్ని కలిగించడం, ఇతర పెట్టుబడిదారుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యాలని అంతర్గత నివేదికల్లో ఉన్నట్లు ఆయన తెలిపారు.




# చివరి వన్డేలో టీమిండియా ఘన విజయం



ఆస్ట్రేలియాతో జరిగిన మూడో, ఆఖరి వన్డేలో టీమిండియా 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇప్పటికే సిరీస్ కోల్పోయినప్పటికీ, ఈ గెలుపుతో క్లీన్‌స్వీప్ గండం నుంచి గట్టెక్కింది. 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ (121లి) అజేయ శతకంతో చెలరేగగా, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (74లి) అద్భుత అర్ధశతకంతో రాణించాడు. బౌలింగ్‌లో యువ పేసర్ హర్షిత్ రాణా నాలుగు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించాడు.

237 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్ శర్మ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (24) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 69 పరుగులు జోడించిన తర్వాత గిల్ ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ, రోహిత్‌తో కలిసి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు.

ఈ జోడీ రెండో వికెట్‌కు అజేయంగా 168 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు విజయాన్ని అందించింది. ఈ క్రమంలో రోహిత్ తన వన్డే కెరీర్‌లో 33వ సెంచరీ పూర్తి చేసుకోగా, కోహ్లీ 75వ అర్ధశతకాన్ని నమోదు చేశాడు. అంతేకాకుండా, ఈ ఇన్నింగ్స్‌తో వన్డేల్లో శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కరను అధిగమించి అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా కోహ్లీ సరికొత్త రికార్డు సృష్టించాడు. అంతకుముందు, సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకుంది. ఆసీస్ జట్టుకు మంచి ఆరంభం లభించినా, భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీసి కట్టడి చేశారు. ముఖ్యంగా, హర్షిత్ రాణా (4/39) తన అద్భుతమైన బౌలింగ్‌తో ఆతిథ్య జట్టును దెబ్బతీశాడు. అతనికి తోడుగా వాషింగ్టన్ సుందర్ రెండు వికెట్లు పడగొట్టగా, సిరాజ్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ తలో వికెట్ తీశారు. దీంతో ఆస్ట్రేలియా 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌట్ అయింది. ఆసీస్ బ్యాటర్లలో రెన్‌షా (56) ఒక్కడే అర్ధశతకంతో రాణించాడు. మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా ఇప్పటికే కైవసం చేసుకున్నప్పటికీ, ఆఖరి మ్యాచ్‌లో సాధించిన ఈ ఘన విజయం టీమిండియాకు కొంత ఊరటనిచ్చింది. టీమిండియా ఈ గెలుపు ద్వారా ఆసీస్ ఆధిక్యాన్ని 2-1కి తగ్గించింది.


## గంగూలీ రికార్డును అధిగమించిన రోహిత్



సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో రోహిత్ శర్మ ఫీల్డర్‌గా ఓ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆసీస్ బౌలర్ నాథన్ ఎల్లిస్ క్యాచ్ అందుకోవడం ద్వారా వన్డే ఫార్మాట్‌లో 100 క్యాచ్‌లు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ (99 క్యాచ్‌లు) రికార్డును రోహిత్ అధిగమించాడు. భారత్ తరఫున వన్డేల్లో 100కి పైగా క్యాచ్‌లు పట్టిన ఆరో ఫీల్డర్‌గా రోహిత్ నిలిచాడు. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ (163), మహ్మద్ అజారుద్దీన్ (156), సచిన్ టెండూల్కర్ (140), రాహుల్ ద్రవిడ్ (124), సురేశ్ రైనా (102) రోహిత్ కంటే ముందున్నారు.




## శ్రీలంకలో 'పెద్ది' సినిమా
# కొత్త షెడ్యూల్ ప్రారంభం



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ చిత్రం 'పెద్ది'. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ కోసం చిత్ర యూనిట్ శ్రీలంకకు పయనమైంది. కొన్ని రోజుల పాటు అక్కడి అందమైన లొకేషన్లలో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. రామ్ చరణ్ ఎయిర్‌పోర్ట్‌కు వెళుతున్న వీడియో ఒకటి ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. దీన్ని అత్యంత భారీ హంగులతో నిర్మిస్తున్నారు. ఇటీవల వినాయక చవితి రోజున, 'పెద్ది' యూనిట్ మైసూరులో ఓ భారీ పాటను చిత్రీకరించింది. ఏకంగా 1000 మంది డ్యాన్సర్లతో రామ్ చరణ్‌పై చిత్రీకరించిన ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఈ సినిమాలోని తన పాత్ర కోసం రామ్ చరణ్ పూర్తిగా కొత్త మేకోవర్‌లోకి మారినట్లు తెలుస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్ ఈ చిత్రంలో ఓ శక్తివంతమైన సహాయక పాత్రలో నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సినిమాను అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు, షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా జరుపుతున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. స్వరమాంత్రికుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండడం ఈ సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. ఈ చిత్రానికి ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 'పెద్ది' చిత్రాన్ని 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా పాన్-ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ఓటీటీలో తమిళ క్రైమ్ థ్రిల్లర్ ..
# 'బ్లాక్ మెయిల్'



జీవీ ప్రకాశ్ కుమార్ ఒక వైపున సంగీత దర్శకుడిగా ఎదుగుతూనే, మరో వైపున హీరోగా కూడా తన జోరును కొనసాగిస్తున్నాడు. తన బాడీ లాంగ్వేజ్ కి తగిన కథలను ఎంచుకుంటూ దూసుకుపోతున్నాడు. అలా రీసెంటుగా ఆయన చేసిన సినిమానే 'బ్లాక్ మెయిల్'. మారన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో కొనసాగుతుంది. సెప్టెంబర్ 12వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ఆడియన్స్ ను అలరించడానికి సిద్ధమవుతోంది. శ్రీరామ్ .. బింధుమాధవి .. తేజు అశ్విని ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా ఓటీటీ హక్కులను 'సన్ నెక్ట్స్' వారు దక్కించుకున్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. థియేటర్స్ దగ్గర ఫరవాలేదని అనిపించుకున్న ఈ సినిమాకి, ఓటీటీ వైపు నుంచి మంచి రెస్పాన్స్ వచ్చే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మణి అనే పాత్రలో జీవీ ప్రకాశ్ కుమార్ కనిపించనున్నాడు. మణి ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తూ జీవిస్తూ ఉంటాడు. అయితే ఆ ఫార్మా సంస్థలో పనిచేసే రేఖ ఇబ్బందుల్లో పడుతుంది. అలాగే అశోక్ అనే వ్యక్తి కూతురు కిడ్నాప్ చేయబడుతుంది. అలాగే అర్చన అనే యువతి కూడా ప్రమాదంలో పడుతుంది. ఈ ముగ్గురు వ్యక్తులు బ్లాక్ మెయిల్ కి గురవుతూ మనశ్శాంతి లేకుండా బ్రతుకుతుంటారు. వాళ్ల జీవితాలలో దాగిన రహస్యం ఏమిటి? వాళ్లను బ్లాక్ మెయిల్ చేస్తున్నది ఎవరు? అనేది కథ.

## నవంబర్ 7న రష్మిక
# 'ది గర్ల్‌ఫ్రెండ్'



వరుస బ్లాక్‌బస్టర్‌లతో కెరీర్‌లో దూసుకుపోతున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న, తన తదుపరి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. దీంతో పాటు సినిమా విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించారు. 'మనం చిన్న బ్రేక్ తీసుకుందామా..' అనే డైలాగ్‌తో ప్రారంభమైన ఈ ట్రైలర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా సాగింది. ఇందులో రష్మిక బాయ్‌ఫ్రెండ్ పాత్రలో యువ నటుడు దీక్షిత్ శెట్టి కనిపించారు. 'యానిమల్', 'పుష్ప 2' వంటి భారీ విజయాల తర్వాత రష్మిక నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో 'ది గర్ల్‌ఫ్రెండ్'పై సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను నవంబర్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. వరుస కమర్షియల్ హిట్ల తర్వాత రష్మిక చేస్తున్న ఈ ప్రయోగాత్మక చిత్రం ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**